


# వెలుగు చూపిన కాళరాత్రి

బత్తిన శ్రీహరి

ప్రయాణికులతో కోలాహలంగా పెండ్లి మండపంలా వుంది విజయవాడ బస్సుస్టాండు. బస్సులు మెల్లగా కొత్త పెళ్ళికూతురులా వచ్చి నిలుస్తున్నాయి. ఎక్కడ కూర్చునేందుకు సీటు లభించదో అన్న భయంతో ప్రయాణీకులు ఒకొక్కరొకళ్ళు త్రోసుకుంటూ బస్సెక్కుతున్నారు. అదో పెద్ద కుస్తీపోటీలావుంది. త్రోసుకునేందుకు బలంచాలని వాళ్ళు "క్యూ" ఏర్పాటు చేయని ఆర్. టి. సి. నిర్వాహకుల్ని దుమ్మెత్తిపోస్తున్నారు. తమకు కావలసిన బస్సురాని వాళ్ళు పెళ్ళి చూపులనాడు అమ్మాయి ఆగమనంకోసం ఆతృతగా నిరీక్షిస్తున్న యువకుల్లా చూస్తున్నారు. అప్పుడప్పుడు పక్కనున్న వాళ్ళను "బస్సెన్నింటికి" అని తెలిసినా ప్రశ్నిస్తున్నారు. అదో ఆతృత, ఆందోళన.

బందరువెళ్ళే బస్సు స్టాపువద్ద రామారావు విసుగ్గా రాతి బెంచీమీద కూర్చున్నాడు. ఈ బస్సులు ఎప్పుడూ యింతే వచ్చినా సమయానికి రావు అని గొణుక్కుంటూ.

రామారావు గమ్యస్థానం ఉయ్యూరు. విజయవాడ, బందరు రూట్ మధ్యలో వస్తుంది. రామారావు ఎదురు చూస్తున్న బస్సు కొంతసేపటికే వచ్చినా ఎంతో ఆలస్యమయినట్లు అనుభూతి పొందాడు. ఆతృతగా ఎలాగో సీటు సంపాదించుకుని కూర్చున్నాడు. ఆ తొక్కిసలాటలో బట్టలు నలిగిపోయాయి. గట్టిగా నిట్టూర్పు విడిచి, ఖర్చీఫ్‌తో మొహం తుడుచుకుని నింపాదిగా సీటులో సర్దుకున్నాడు.

ఇంతకు పూర్వం రామారావు అదే మార్గంలో అనేకసార్లు ప్రయాణించినా ఈసారి ప్రయాణం వేరు. ఇంతకు ముందు మామూలు విద్యార్థి రామారావు. ఇప్పుడు డాక్టరు రామారావు.

ఆ విషయం తలచుకుంటేనే అతని మనసు ఆనందంతో పులకించిపోతూంది. విచిత్రమైన అనుభూతి. అదో నూతనోత్సాహం - స్పందన.

మెల్లగా 'హిగిన్ బాదమ్స్'లో కొన్న నవల చదవడం ప్రారంభించాడు. చదువుతున్నాడే కాని అతని మనస్సు పుస్తకంలో లేదు. అచ్చులోని అక్షరాల బదులు పద్మ నిండైన రూపం అతని కళ్ళకు కనపడుతూంది.

పద్మ అతనిలోని మధుర స్మృతి.

అతను వనంలోని తరువైతే, ఆమె అతనిని అల్లిబిల్లిగా అల్లుకున్న వికసిత కుసుమాచ్ఛాదిత లతిక.

అతను పల్లవి - ఆమె అనుపల్లవి.

అతను ఊహ, ఆమె ప్రాణం.

పాఠక మహాశయా - వారిరువురి అనుబంధానికి ఇంతకన్నా వర్ణన అనవసరం. వారిరువురి అందాన్ని కూడా అంతగా వర్ణించనవసరంలేదు. వారికి వారు నచ్చారు. గాఢంగా ప్రేమించుకున్నారు. అంతే మనకు ప్రస్తుతం కావలసింది.

పద్మ ఆ వూళ్ళోనే ఉపాధ్యాయినిగా జీవిస్తోంది.

* * *

ఇక్కడ కొంత కాలాన్ని వెనక్కు నడిపి గతం తెలుసుకుందాం.

అవి రామారావు ఇంటర్ పరీక్షలు పూర్తిచేసి పాసు తెచ్చుకున్నా డనిపించుకుని ఉద్యోగాన్వేషణలో తిరుగుతున్న రోజులు. ఇంటివద్ద సవతి తల్లి పోరు, ప్రతిచోటా వెక్కిరించే నో వేకెన్సీ బోర్డులు. తల్లిమాటకు ఎదురాడని తండ్రి. అను

క్షణం సాధించే తల్లి కాని తల్లి.

తన స్థితి తలచుకుంటూ ఒంటరిగా వస్తున్నాడు రామారావు అప్పుడే రెండవ ఆట సినిమా వదిలాటు. గ్రంథాలయం పక్కన చీకటిగావున్న సందులో "హెల్ప్-హెల్ప్" అన్న పెద్ద కేక వినపడి అక్కడికి పరుగెత్తాడు రామారావు. అక్కడ కొందరు రౌడీలు ఒంటరిగా వున్న ఒక అమ్మాయిని బలాత్కరించబోతున్నారు.

"ఎవర్రా అది" అని గట్టిగా అరిచాడు రామారావు. ప్రమాదమని పసిగట్టిన రౌడీలు వెంటనే పిక్కబలం చూపారు.

"చాలా థాంక్స్ సమయానికి రక్షించారు. మీరు రాకుంటే ఆ దుర్మార్గుల చేతుల్లో పడిపోయేదాన్నే" భయంతో ఆమె గళం. శ్రుతి సరిలేని వీణానాదంలా వుంది.

ఆమె "పద్మ"...

వారి పరిచయం అక్కడ ఆరంభమయింది. ఆ ప్రారంభం అక్కడితో ఆగిపోలేదు. పద్మను ఆమె ఇంటివరకూ తోడువెళ్ళి పంపించాడు రామారావు. ఒకరిగూర్చి మరొకరు వ్యక్తిగతంగా తెలుసుకున్నారు. మెల్లమెల్లగా వారి బంధము అనుబంధమై ప్రేమగా మారి పెనవేసుకుంది. గాఢంగా అల్లుకుని విడిగా వుండలేమనే నిశ్చయానికొచ్చారు.

వూళ్ళో రకరకాల పుకార్లు బయలుదేరాయి. కొందరు రామారావుతో చనువున్న వ్యక్తులు మొహంమీదే అన్నారు "తలేదాన్నిపట్టావురా" అని.

ఒక రోజు యధాలాపంగా తన విషాదగాథ, ఆమెతో చెప్పాడు రామారావు. అతని చరిత్ర వింటూంటే కారిన కన్నీరు తుడుచుకుని "మీరు పై చదువులు చదవండి నే డబ్బిస్తాను" అంది. ముందు అంగీకరించకపోయినా తర్వాత ఆమె బలవంతంమీద అంగీకరించాడు రామారావు.

ఫలితంగా మెడికల్ కాలేజీలో చేరాడు. మొదటి సంవత్సరం మూడు నెలలకోసారి సెలవలలో వచ్చి చూచి వెడుతుండేవాడు. రెండవ సంవత్సరం మధ్యలో దసరా సెలవలకు వచ్చినపుడు ఇంక అపూరు డిగ్రీ తీసుకునేవరకూ రావద్దని ఆంక్ష పెట్టింది. అప్పటికే వూరో లేచిన దుమారం తెలిసిన వాడవటం పల్ల మాటలు పడలేక అలా చెబుతూందని అంగీకరించాడు. అదే ఆఖరుసారి పద్మని అతను చూడటం.

* * *

పద్మ ఇప్పుడు ఎలావుందో, ఏం చేస్తోందో, నన్ను చూడగానే ఏమను కుంటుందో" తనలో తను ఆలోచిస్తూ పుస్తకంలో నుంచి తలెత్తాడు పేజీ కదలని పుస్తకం నీ ఆలోచనలింకా మొదటి పేజీలోనే వున్నాయని చూపింది.

ముందు సీట్లో ఎవరో ఇద్దరు మాట్లాడుకుంటున్నారు. రామారావు పక్కన కూర్చున్న పెద్ద మనిషి నిద్రలో తూగి రామారావు భుజంమీద పడ్డాడు.

ముందు సీట్లో వాళ్ళమాటలు

"...పద్మ ఉద్యోగం పోయిన తర్వాత వ్యభిచారం చేస్తోందటగా!"

"ఉద్యోగం పోతే ఏదో ఒక ఉద్యోగం ఉండొద్దూ... నాలుగేళ్ళ నుంచీ జరుగుతున్న భాగోతానికి ఇప్పుడు కొత్తేమిటి" రెండో వ్యక్తి.

"ఇవ్వాళ మొదలేంకాదు. ఐదారు సంవత్సరాల క్రితమే ఎవరో కుర్రాడ్ని చెప్పుకున్నారు... వివరాలు సరిగా తెలియవు"

"కాంగ్రెసు ఇంకా ఎంతకాలముంటుందంటావు!" వాళ్ళ సంభాషణ రాజకీయాలలో తల దూర్చింది.

రామారావులోని ఉద్రేకం బుసకొట్టింది. పిడికిలి బలంగా ముడిచాడు. సభ్యత, సంస్కారం అతని దారినుంచి ముందు సీట్లో వాళ్ళిద్దరినీ రక్షించాయి. మనసులోనే బాధపడ్డాడు.

'...లోకం ఇంతే! పుకార్లు పుట్టించి ఆనందించడం దానికానందం. పద్మకు ఉద్యోగం పోయిందంటారేమిటి. ఆఖరి ఉత్తరంలో కూడా నా ఉద్యోగం యథాతథంగా వుంది, నీవు ఎపుడు డాక్టరుగా నా ముందు నిలబడతావా అని చూస్తున్నాను అని రాస్తే... వీళ్ళు మరో 'పద్మ' గురించి మాట్లాడుకుంటున్నారామో!'

వివిధ విధాలుగా ఊహిస్తూ సమాధానపడ్డాడు రామారావు. మనసు కలత చెంది కెలికివేస్తూనే వుంది.

"ఉయ్యూరు." గట్టిగా అరిచాడు. కండక్టరు. అంతకు పూర్వమే కంకిపాడులో ప్రారంభమయిన వర్షం జల్లులు జోరుగా పడుతున్నాయి.

"రిక్షా" ముందు పద్మనే చూడాలని నిశ్చయానికొచ్చిన రామారావు పద్మ ఇంటి అడ్రస్సు చెప్పాడు రిక్షావానితో. రిక్షా భారంగా కదులుతూంది. వర్షం చినుకులు మొహంమీద పడుతున్నాయి.

రామారావు ఆలోచిస్తున్నాడు. "నా శరీరం మనస్సు. నేను సంపాదించే డబ్బు సర్వస్వం పద్మవే... భవిష్యత్తులో పద్మ చరణాచరణ చక్రవర్తి రామారావు... అందరూ రామారావు భార్యదాసుడు అంటారు కాబోలు" తనలో తనే సన్నగా నవ్వుకున్నాడు.

"బాబూ, ఇల్లొచ్చింది," అన్న రిక్షావాని మాటలతో ఊహాలోకం నుంచి వాస్తవంలో ప్రవేశించి రిక్షాదిగి డబ్బులిచ్చాడు, రామారావు హృదయం వేగంగా కొట్టుకోనడం ప్రారంభించింది వింత అనుభూతి అతని నావరించింది. తడబడే అడుగులతో రెండడుగులు వేశాడు.

తెరచి వుంటాయను కున్న తలుపులు మూసి వున్నాయి.

ఎన్నో తలపులతో ఎదురు చూస్తూంటుందనుకున్న పద్మ - సవ్వడి కూడా వినపడటం లేదు.

"లోపల ఏం చేస్తూందో" అనుకుంటూ దగ్గరకు వేసివున్న తలుపులు త్రోసుకుని లోపలికి వెళ్ళాడు.

పద్మ జాడ లేదు.

ఆతృతగా, ఆందోళనగా "పద్మ! పద్మా" అని పిలుస్తూ పక్కగదిలో ప్రవేశించిన రామారావు మంచం మీద నిద్రిస్తున్న పద్మను చూశాడు.

ఇంత మొద్దు నిద్రపోతూందేమిటని ఆశ్చర్యపడుతూ మరల "పద్మా" అని గట్టిగా పిలిచాడు.

సమాధానం రాలేదు.

అనుమానమొచ్చి పరీక్షించాడు. నాడీచాలా బలహీనంగా వుంది. మొహంమీద నీరు జల్లి ఉపచారంచేసిన తర్వాత మెల్లగా కళ్ళు తెరచింది పద్మ.

"...మీరు వస్తారనే ఆశగా నిరీక్షిస్తున్నాను... నా కోరిక తీరింది.. మీకు రాసిన ఉత్తరం..." అతి కష్టంతో టేబుల్‌మీద వున్న కవరు చూపింది ..."నన్ను...నన్ను క్షమించండి" పద్మ కళ్ళు బరువుగా మూతలు పడుతున్నాయి.

రామారావు వణుకుతున్న చేతులలో లెటర్ చదవటం ప్రారంభించాడు. టేబిల్ దగ్గరకు ఎలా నడిచాడో, ఉత్తరం ఎలా తీసుకున్నాడో అతనికే తెలియదు. అతని మస్తిష్కం స్తంభించిపోయింది. అతనిది వర్ణనాతీతమైన అర్ధచేతనావస్థ. విద్య నేర్చుకుంటూనే ధైర్యస్థుడుగా మంచి వైద్యుడుగా. ఎంతటి క్లిష్ట పరిస్థితిలోనైనా చలించక వైద్యము చేయగలిగిన వ్యక్తిగా పేరు పొందిన రామారావు ప్రస్తుతము భీరువుగా మారిపోయాడు. అతనిలో యిన్ని సంవత్సరాలుగా నిండుకున్న వైద్య విజ్ఞాన పరిజ్ఞానము ఆతనికేమాత్రం సహాకరించడం లేదు. అతను నిరుత్తరుడు, నిశ్చేష్టితుడు. మెల్లగా తనలోని శక్తినంతా కూడగట్టుకుని ఉత్తరం చదవడం ఆరంభించాడు.

ప్రియశ్రీ,

నీకు పూర్తిగా వివరాలు తెలియపరచాలనే ఈ లెటర్ రాస్తున్నాను. మా తండ్రిగారు నా చిన్నతనంలోనే పరమపదించారు. అమ్మ ఎన్నో బాధలు పడి నన్ను టీచర్ ట్రైనింగ్ చదివించి నీ బ్రతుకు నీవు బ్రతకమని నాన్నగారిని చేరుకుంది. దిక్కులేని నాకు మా అవ్వదిక్కై నిలచింది. ఆమె దగ్గరే ఉన్నాను. కొంతకాలానికి మీ వూర్లో ఉద్యోగం లభించింది. అవ్వను నాతోనే తీసుకొచ్చి ఇక్కడే టీచర్‌గా కాలం గడుపుతున్నాను. మన పరిచయం హఠాత్తుగా జరిగింది. ఆ తర్వాతమీకు తెలుసు నా అంత అదృష్టవంతురాలు లేదని మురసి పోయాను.

నిన్ను డాక్టరుగా చేయాలనే భావంతో నీ చదువుకు డబ్బు పంపుతున్నాను. లోకులు ఎన్నిమాటలన్నా నేపట్టించుకోలేదు. అది నా స్వార్థం. నా భర్త డాక్టరు కావాలి. అందుకోసం నేనెంత కష్టంగా కాలం గడుపవలసి వచ్చినా నాకు అపరిమితమైన సంతోషం కలిగింది కాని నేను ఏ మాత్రం చింతించలేదు కాలగర్భంలో మొదటి సంవత్సరం గడచి పోయింది, కాని రెండవ సంవత్సరం...నా ఆనందం చూడలేని 'విధి' విషసర్పం కాటేసింది. ప్రభుత్వము వారు "రిట్రెంచ్‌మెంట్" పేరు పెట్టిన ఉద్యోగాల కోతల జాబితాలో నేను కూడా చేర్చబడ్డాను.

అందుకు ఫలితం భవితవ్యం ప్రశ్నార్థకంగా నిలచింది. నా జీవికకు డబ్బు కావాలి, నీ చదువు, నన్ను నమ్ముకున్న బామ్మ పోషణ ... ఇన్నింటికి డబ్బు కావాలి. మానవులను మరబొమ్మలను చేసి ఆడించే ఆ డబ్బు

మనవద్ద లేదు. మరో ఉద్యోగం కోసం ఎన్ని ప్రయత్నాలు చేసినా ఎక్కడా లభించలేదు.

తుదకు అన్ని విషయాలూ ఆలోచించి, మనసు చంపుకుని, శరీరాన్నమ్ముకోవడం ప్రారంభించాను ... అందరి అవసరాలు తీరాయి. రెండు సంవత్సరాల క్రితం బామ్మ నన్ను ఒంటరిదాన్నిచేసి వెళ్ళిపోయింది. నేటికి నీ చదువు పూర్తయింది. నే చేసిన పనికి సంజాయిషీ చెప్పుకోవడం కాదు నా ఉద్దేశ్యం. నిజం నీకు తెలియపరచాలని. నా జీవితం, ఈ మధ్య కాలంలో, నీవు పూర్లో లేని సమయంలో ఎలా గడిచింది; నిజం ఏనాటికైనా బయటపడక మానదు. అందువలన నేనే తెలియ చేస్తున్నాను.

రామ్ !

సత్యం నీకు మూడవ వ్యక్తిద్వారా తెలిసిన రోజు నీవు నన్ను ద్వేషించవచ్చు, అసహ్యించుకోవచ్చు. లేదా నేను బ్రతికివుంటే నీవు త్యాగమని భావించి నా కష్టానికి (?) ప్రతిఫలంగా నన్ను వివాహం చేసుకోవచ్చు. అలా జరిగితే ప్రపంచం నిన్ను హేళన చేస్తుంది. డాక్టరుగారి భార్య వ్యభిచారి ... పతిత ... అంటుంది.

నీవు నన్ను అసహ్యించుకున్నా, లోకం నిన్ను హేళన చేసినా ఈ రెంటిలో ఏది జరిగినా నేను భరించలేను. ఆ బాధ భరించడంకన్నా నీకు శాశ్వతంగా దూరం కావడం మేలనుకున్నాను. అంతే కాదు పవిత్ర హృదయుడవైన నీకు అపవిత్రమైన నా మలిన శరీరాన్ని అర్పించలేను.

అందుకే... ఈ పని చేస్తున్నాను.

రామూ !

అఖరు సారిగా ఒక్కమాట నేను ఏది చేసినా నీ మీద ప్రేమతోనే చేశాను. నీవు నన్ను తలచుకుని ఒక్క కన్నీటి చుక్కరాలిస్తే... నాకు చాలు ఈ జీవితానికి. శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను.

ప్రేమతో, నీ
"అభాగ్యురాలు పద్మ"

"పద్మా" రామారావు పెద్దగా అరచి మంచం దగ్గరకు పరిగెత్తాడు.

పద్మ కళ్ళు అప్పటికే తేలిపోతున్నాయి. నోట్లో నుంచి నురుగులు వస్తున్నాయి. డాక్టరు రామారావు నిస్సహాయంగా విశ్వ ప్రయత్నం చేస్తున్నాడు.

బయట బీభత్సం చేస్తున్న వర్షం పెను తుఫాను.

ఎక్కడో ఉరుము.

మరొకచోట మెరుపు.

ఒక పిడుగు నేల రాలింది.

రామారావు చేతులలో పద్మ అంతిమ శ్వాస పీల్చి శాశ్వత నిద్రలోనికి జారింది.

మంచం ప్రక్కనే నేలమీద స్లీపింగ్ పిల్స్ బాటిల్ వెక్కిరిస్తూంది.

రామారావు జీవితానికి వెలుగునిచ్చిన కొవ్వొత్తి పూర్తిగా కాలకుండానే ఆరిపోయింది.

★

బతుకమ్మ



— వై. బాలయ్య, సిద్దిపేట.

# సంక్రాంతి

వస్తున్నది సంక్రాంతి
తెస్తున్నది క్రొత్తకాంతి
నవవసంత శోభలతో
వస్తున్నది సంక్రాంతి
తెస్తున్నది వింతకాంతి

తెలిమల్లె పూవులతో
అందమైన కాంతులతో
పసందైన పైరులతో
వస్తున్నది సంక్రాంతి
తెస్తున్నది వింతకాంతి

నీలి నీలి మబ్బులతో
క్రొత్త క్రొత్త సొగసులతో
వరిపైరు కోతలతో
వస్తున్నది సంక్రాంతి
తెస్తున్నది వింతకాం

పైరుపంట శోభలతో
పసందైన గాలులతో
ప్రగతిదారి చూపిస్తూ
పురోగతిని ఆశిస్తూ
వస్తున్నది సంక్రాంతి
తెస్తున్నది వింతకాం

— ముళ్లపూడి చక్రధరరా: